Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Editor : Dama Vijaya Kumar | Volume : 6 | issue: 346 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :346 | బుధవారం 17 డిసెంబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4




## మావోయిస్టు హింసాత్మక ఘటనలు 89శాతం తగ్గుముఖం



- కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్
- 2010లో గరిష్ఠంగా 1,936 ఘటనలు నమోదవగా.. 2025 నాటికి 222కు చేరాయి
- వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు తీసుకువచ్చిన జాతీయ విధానం-కార్యచరణ ప్రణాళిక సమర్థవంతంగా అమలవుతోంది
- గిరిజన, మారుమూల ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం మావోయిజం మూల కారణాలను పరిష్కరించింది

## ఆస్ట్రేలియా తరహాలో భారత్‌లోనూ కాల్పులు జరిగే అవకాశం



- ఇంటెలిజెన్స్ హెచ్చరిక
- ఆస్ట్రేలియాలోని బాండీ బీచ్‌లో తండ్రీకొడుకుల కాల్పులు, 16 మంది మృతి
- ఐసిస్ భావజాలంతోనే ఈ దాడికి పాల్పడినట్లు నిర్ధారణ
- భారత్‌లో న్యూ ఇయర్ వేడుకల లక్ష్యంగా దాడులు జరగొచ్చని నిఘా వర్గాల హెచ్చరిక
- దాడికి పాల్పడిన ఉగ్రవాదులు భారత పాస్‌పోర్టులు వాడినట్లు వెల్లడి
- గోవా వంటి పర్యాటక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని సూచన



### ఏ బిల్లునూ ఇష్టారాజ్యంగా

## మార్చకూడదు

- ఎవరైనా వ్యక్తిగత అభిలాష, పక్షపాతం, స్వేచ్ఛ ఆధారంగా చట్టాలు చేయకూడదు
- గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ ఇచ్చే జీ- రామ్- జీ పథకాన్ని రద్దు చేసి కొత్త బిల్లుతో భర్తీ చేయడం అన్యాయం
- గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశంలోని కోట్లాది కుటుంబాలకు రక్షణ కవచం.
- కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా

### త్వరలో ప్రజల డిజిటల్

# హెల్త్ రికార్డులు

- ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గాలి
- ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ ముందుకు
- 'వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు నిర్దేశించిన అంశాలను అమలు చేస్తున్నాం
- ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నాం
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశాం
- రియల్ టైమ్ లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుంది.
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలను అవలంబిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడంతోపాటు... నిపుణుల సలహాలను తీసుకోవాలని సీఎం సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షించారు. ఈ మేరకు గేట్స్ ఫౌండేషన్ తో కలిసి వైద్యారోగ్య రంగంలో ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని సహా వివిధ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బందాన్ని ఏర్పాటు చేశారు. యూఎన్ఎయిడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఎఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, - మిగతా3లో



## టీడీపీ రథసారధులు వీరే!

### 11 జిల్లాలలకు కొత్త అధ్యక్షుల పేర్లు ఖరారు

### గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం చంద్రబాబు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

తెలుగుదేశం పార్టీకి సంబంధించి 11 జిల్లాలకు కొత్తగా అధ్యక్షుల పేర్లు దాదాపు ఖరారయ్యాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబు పేర్లను ఖరారు చేశారు. చట్టసభలకు ఎన్నిక కాని వారు, నామినేటెడ్ పోస్టులు దక్కని వారు ఈ పదవులకు పోటీ పడ్డారు. వీరిలో కొందరి పేర్లను అధిష్ఠానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి సమాచారం అందింది. త్వరలో దీనిపై పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశముంది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన ప్రకారం జిల్లా అధ్యక్షుల పేర్లు ఇవీ.. కాలవ శ్రీనివాసులు (అనంతపురం), ఎంఎస్ రాజు (శ్రీసత్యసాయి), కిమిడి నాగార్జున (విజయనగరం), సుబ్బారెడ్డి (నంద్యాల), పనబాక లక్ష్మి (తిరుపతి), షణ్ముగం (చిత్తూరు), సుగవాసి ప్రసాద్ (అన్నమయ్య), ఉగ్ర నరసింహారెడ్డి (ప్రకాశం), రేచర్ల వెంకటేశ్వరరావు (నెల్లూరు), సలగల రాజశేఖర్ (బాపట్ల), కొమ్మాలపాటి శ్రీధర్ (పల్నాడు)ల పేర్లు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.




## థాయ్-కంబోడియా సరిహద్దు వివాదం..

- తీవ్రమవుతున్న ఘర్షణలు.. థాయ్‌లాండ్ కీలక డిమాండ్
- కాల్పుల విరమణపై ముందు కంబోడియానే ప్రకటించాలని థాయ్‌లాండ్ డిమాండ్
- తమ భూభాగంపై కంబోడియానే దాడికి పాల్పడిందని ఆరోపణ
- సరిహద్దు ఘర్షణల్లో ఇప్పటివరకు 32 మంది మృతి
- దాదాపు 8 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులుగా మారిన వైనం

### వాజ్ పేయి మార్గంలోనే

## ప్రధాని మోదీ పాలన

- చంద్రబాబు ఢిల్లీ వెళితే సొంత కొడుకు వచ్చినంతగా వాజ్ పేయి సంతోషపడేవారు
- మచిలీపట్నంలో వాజ్ పేయి విగ్రహావిష్కరణ
- హాజరైన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి వాజ్ పేయి అని కితాబు
- తనకు స్ఫూర్తినిచ్చిన నాయకుడు అటల్ బిహారీ వాజ్ పేయినే అని వెల్లడి
- తెలుగు జాతి అటల్ జీకి ఎప్పటికీ రుణపడి ఉంటుందని ఉద్ఘాటన



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

తన జీవితాన్ని దేశానికే అంకితం చేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి అని, ఆయన పేరు చెబితేనే నమ్మకం, అభివృద్ధి, సుపరిపాలన గుర్తుకు వస్తాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. భారతరత్న వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన 'అటల్ సందేశ్–మోదీ సుపరిపాలన' బస్సు యాత్రలో లోకేశ్ ముఖ్య అతిథిగా - మిగతా3లో



## మోదీకి ఆ రెండు అంశాలు అసలే గిట్టవు

- గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- రాహుల్ గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు మోదీకి నచ్చవని వ్యాఖ్య
- ● ఈ పథకాన్ని బలహీనపరచాలని పదేళ్లుగా చూస్తున్నారని ఆరోపణ
- గాంధీజీ గ్రామ స్వరాజ్యం ఆలోచనలకు ప్రతిరూపమే గ్రామీణ ఉపాధి హామీ పథకం

### కొత్త కానిస్టేబుళ్లకు

# అపాయింట్ మెంట్ లెటర్స్



- మంగళగిరిలో 5,757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాల పంపిణీ
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రాలు
- కేసులను అధిగమించి ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి
- వివేకా హత్య కేసును ప్రస్తావిస్తూ పోలీసుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు
- ఈ నెల 22 నుంచి కొత్త కానిస్టేబుళ్లకు శిక్షణ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఎంపికైన 5,757 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం మంగళగిరిలో మంగళవారం జరిగింది. మంగళగిరి ఏపీఎస్పీ పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. "కానిస్టేబుల్ ఉద్యోగాలపై ఉన్న కేసులను అధిగమించి, నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ నియామకాలు పూర్తి చేశాం. మా ప్రభుత్వంలో ఉద్యోగాలు వస్తాయి... వేరే వాళ్లు వస్తే పోతాయి" అని అన్నారు. తన హయాంలో - మిగతా3లో




## నేషనల్ హెరాల్డ్ కేసులో బిగ్ రిలీఫ్

- సోనియా, రాహుల్ గాంధీలకు బిగ్ రిలీఫ్ ఊరట
- నేషనల్ హెరాల్డ్ కేసులో చార్జ్‌షీట్‌ను ఈడీ అధికారులు దాఖలు చేసిన విషయం తెలిసిందే.
- ఈ కేసును పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది.
- కేవలం ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుగుతోంది

# రాష్ట్ర గవర్నర్‌కు ఘనస్వాగతం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** తిరుపతిజిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లాకలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ తదితర అధికారులు ఉన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

## బొజ్జల బృందమ్మ

### మొత్తం,53,245/- రూపాయల చెక్కులు పంపిణీ



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్16 :** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని, వైద్య అవసరాల కోసం దరఖాస్తు చేసిన వెంటనే నిధులు మంజూరు అవుతున్నాయని శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సతీమణి బొజ్జల బృందమ్మ అన్నారు. మంగళవారం రేణిగుంట పట్టణంలోని కరకంబాడి, వేణుగోపాలపురం, పాంచాలి నగర్ ప్రాంతాల్లో టీడీపీ మండల నాయ కులతో కలిసి సీఎం సహాయనిధి మొత్తం 2,53,245/- రూ చెక్కులను లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో ప్రభుత్వ సహాయం ప్రజలకు భరోసా కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా చికిత్సకు అవ సరమైన ఆర్థిక సాయం అందుతోందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది నిరుపేదల ప్రాణాలు నిలబడుతు న్నాయని వైద్యం, విద్యా రంగాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బొజ్జల బృందమ్మ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# చౌడేపల్లిలో లేబర్ ఇన్స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** మండల కేంద్రమైన చౌడేపల్లిలో మంగళ వారం పుంగనూరు లేబర్ ఇన్స్పెక్టర్ మరికొందరు అధికారులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఫ్యాన్సీ స్టోర్లు స్కూటర్ మెకానిక్ దుకాణాలు టి దుకాణాలు జువెలరీ షాపులు వంటివి తనిఖీ చేశారు. ఒక ఫ్యాన్సీ స్టోర్‌లో సక్రమంగా లైసెన్సు చెల్లించలేదంటూ నోటీసులు జారీ చేస్తామని లేబర్ ఇన్స్పెక్టర్ మధుబాబు తెలిపారు, అదే విధంగా అదే దుకాణంలో పనిచేసే మహిళలకు తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని వారికి సైతం నోటీసులు ఇస్తున్నట్లు ఆయన వివరించారు, అదేవిధంగా బాల కార్మికులను ఎవరు పనిలోకి ఉంచుకోరాదని ఈ సందర్భంగా తెలియజేశారు ఎవరైనా అలా చేస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అనంతరం పలు దుకాణాలను తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ కేశవరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సులోచన, రాధ,పోలీసులు, ఏఎస్డబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందించడమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** అన్నమయ్య జిల్లా పీలేరు వివిధ ప్రమాదాల కారణంగా గాయపడి ప్రైవేట్ వైద్యశాలల్లో సేవలు పొంది, ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన 33మందికి 3 లక్షల 54 వేల142 రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాఫీగా సాగుతున్న కుటుంబాల్లో ఊహించన విధంగా అనారోగ్యం ఎదురైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంలా పేదలకు ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, కోటపల్లి బాబురెడ్డి, రమణారెడ్డి, మోహన్ రెడ్డి, పోలిశెట్టి, సురేంద్ర, ఖాదరభాష, తదితరులు పాల్గొన్నారు.

# సహజ ఇంధన వనరులు పొదుపుగా వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** సహజ ఇంధన వనరులు పొదుపుగా వినియోగించుకోవాలి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కట్టమంచి వివేకానంద విగ్రహం నుండి విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీని కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యుత్తు ను పొదుపుగా వినియోగిస్తే ఎన్నోప్రయో జనాలు చేకూరుతా యన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఇందనం పొదుపులో మంచి ఫలితాలు సాధించుచున్నదని తెలిపారు. జిల్లాలో 200 మెగా కిలో వాట్స్ ద్వారా పీఎం సూర్యమర పథకం ద్వారా నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు అందరం కలిసి పనిచేస్తే విద్యుత్ పొదుపు వలన 5000 మెగా వాట్స్ పొదుపు చేసుకోవచ్చని తెలిపారు, ప్రభుత్వ భవనాలలో పీఎం సూర్యమర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఆదాయం చేసుకోవచ్చని తెలిపారు. విద్యుత్ పొదువు లక్ష్యంగా కృషి -చేయాలని, భావితరాల దృష్ట్యా విద్యుత్తును ఆదా చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన," వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సోలార్ ఇ రూఫ్ టాప్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని ప్రజలను కోరారు. పీఎం సూర్య మర్ స్టాల్స్ ద్వారా సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామ న్నారు. సోలార్ రూఫ్‌టాప్స్‌పై సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యుత్ పొదువు పై ప్రజలకు అవగాహన కొరకు విద్యుత్ సంరక్షణ - భవిష్యత్ రక్షణ, విద్యుత్ పొదుపు చేద్దాం భావితరాలకు వెలుగు నిద్దాం. విద్యుత్ పొదుపు రేపటి మదుపు, ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్టి, విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు, సౌర విద్యుత్ వాడుదాం- ప్రకృతిని కాపాడుదాం, సౌర విద్యుత్ వాడుదాం కాలుష్యాన్ని నియంత్రిద్దాం, సౌర విద్యుత్ వాడుదాం- విద్యుత్ చార్జీలను నియంత్రిద్దాం, ఇంటింటా విద్యుత్ పొదుపు ఊరూ రా వెలుగు, సేవ్ పవర్ సేవ్ నేషనల్ అనే నినాదాలతో ర్యాలీ గాంధీ సర్కిల్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో పి. అయ్యుబుఖాన్ డైరెక్టర్, ఎస్పీడీసీ ఎల్ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్, విద్యుత్ అధికారులు మునిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో వేగవంతంగా క్లెయిమ్‌ల పరిష్కారం

**జిల్లాలో పోలింగ్ స్టేషన్ ల 203 అదనపు పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

**జిల్లాలో 15,75,899 మంది ఓటర్లు ఉన్నారు ఈ తేదీ నాటికి**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** జిల్లాలో 15,75,899 మంది ఓటర్లు ఉన్నారు ఈ తేదీ నాటికి ఉన్నారని జిల్లాకలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లాలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం, జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్, మరణించిన వారిని జాబితా నుండి తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించవచ్చున్నారు. జిల్లాలో 1776 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో బిఎల్ఓలకు ఈ ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ బిఎల్ఏ ద్వారా పరిశీలించవచ్చునని తెలిపారు. దీనితో పాటు రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన బోగస్, మరణించిన వారి వివరాలను బిఎల్ఓలకు తెలిపి ఓటరు జాబితా నుండి తొలగించే కార్యక్రమానిక సహకరించాలని కోరారు. సంబంధిత బిఎల్వోలు 70% మ్యాపింగ్ చేయడం, జరిగిందని తెలిపారు. ఈ తేదీ నాటికి జిల్లాలో 7 నియోజక వర్గంలో కలిపి 15,75,899 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 18 సం.ల వయసు పూర్తిచేసి నూతనంగా ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ సంతృప్తికరంగా కొనసాగు తున్నదన్నారు. అంతకుమునుపు జిల్లా కలెక్టర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం గోడౌన్ లను తనిఖీ చేశారు. EVMS, VVPATs పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ మోహన్ కుమార్ టిడిపి పార్టీ ప్రతినిధి సురేంద్ర కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పరదేశి, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, బీఎస్పీ పార్టీ సురేంద్ర, వైఎస్ఆర్ పార్టీ ప్రతినిధి ఉదయ్ కుమార్, సిపిఎం పార్టీ ప్రతినిధి గంగరాజు,ఎలెక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తఇండ్లు జెపిహెచ్‌ఎస్‌లో ఉచిత మెడికల్ క్యాంపు





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలోని, గ్రేస్ మేరియా చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తఇండ్లు జెపిహెచ్ఎస్ పాఠశాల్లో ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతం చేశారు. ట్రస్టీ ఆరోగ్యరాజ్, సెక్రటరీ జేసుమేరీలు పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఇఎస్ వైద్యులు 200 మంది విద్యార్థులకు ఉచిత చికిత్స అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాజ్ ఖాన్, ఇన్‌చార్జ్ రమేష్, తెలుగు ఉపాధ్యాయుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తంగా ఉండండి.



## డాక్టర్ కోలారు ప్రకాష్.

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** చలికాలంలో జ్వరం జలుబు రావడం సాధారణంగా భావించి వైద్యులను సంప్రదించకుండా ఉండకండి. స్క్రబ్ టైపస్ అనే చిన్న కీటకం వల్ల కూడా జ్వరం, తలతిరగడం, వాంతులు, ప్లేట్‌లెట్స్ పడిపోవడం జరుగుతుంది. అశ్రద్ధ చేయడం వల్ల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. రెండురోజుల కన్నా జ్వరం అధికంగా ఉంటే కచ్చితంగా నాణ్యమైన వైద్యులను సంప్రదించండి. మనం చేసే అశ్రద్ధవల్ల ప్రాణాలు పోవొచ్చు, సకాలంలో గుర్తించగలిగితే చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొని రావచ్చునని తెలిపారు.

## ప్రతి ద్విచక్ర వాహనదారుడు

# హెల్మెట్ వాడండి ప్రాణాలను రక్షించుకోండి

**ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరి వాడాలి : ఎస్సై సుమన్**



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ వాడాలి అని ఎస్ఆర్‌పురం ఎస్సై సుమన్ తెలిపారు మంగళవారం ఎస్సై సుమన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. అని తెలిపారు రోడ్డు ప్రమా దాలు ఎక్కువ ద్విచక్ర వాహనాలు వల్ల ప్రమాదాలు జరుగుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు అందు వలన హెల్మెట్ వాడితే మీ ప్రాణాలకు శ్రీరామరక్ష. లాగా ఉంటుందని తెలిపారు అలాగే ప్రతి ద్విచక్ర వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలి అలాగే ద్విచక్ర వాహనానికి సంబంధించిన రికార్డులు అన్ని సక్రంగా కలిగి వాహనాన్ని నడపాలని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు లోపల చిన్నారులకు ద్విచక్ర వాహనాలు నడిపితే ద్విచక్ర వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే ఎస్ఆర్‌పురం మండలంలో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించిన వారికి పెట్రోల్ అందించాలని పెట్రోల్ బంక్ యజమానులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది నో హెల్మెట్ నో పెట్రోల్ అనే ప్లకా ర్డులను పెట్రోల్ బంకుల వద్ద ఏర్పాటు చేశారని తెలిపారు. కావున హెల్మెట్ వాడదాం ప్రాణాల ను రక్షించుకుందాం. ఎస్సై సుమన్ తెలిపారు.

# న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 16:** అన్నమయ్య జిల్లా పీలేరు కోర్టులో పనిచేస్తున్న న్యాయవాదులకు ఇంటి స్థలాలు కేటాయించాలని పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బీసీ పురుషోత్తంరెడ్డి, ఆర్ చంద్రశేఖర్‌లు మంగళవారం ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీలేరు కోర్టులో పనిచేస్తున్న చాలామంది. న్యాయవాదులకు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారికోసం ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సి.వి.రెడ్డి, యువన్యాయవాది టి ఎల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపరశురామేశ్వర స్వామి అభిషేక కార్యక్రమంలో

# కాదంబరి వేలూరు విట్ కాలేజ్ చైర్పర్సన్



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్16 :** శ్రీపరశురామేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో స్వామివారి అభిషేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కాదంబరి వేలూరు విట్ కాలేజ్ చైర్పర్సన్ స్వామివారి అభిషేకానికి విచ్చేశారు. అభిషేకానంతరం వారికి ఆలయ మర్యాదలు నిర్వహించగా, ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడ,కార్య నిర్వా హణాధికారి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలపై దృష్టి

## -రేణిగుంట పీహెచ్‌సీని తనిఖీ చేసిన బొజ్జల బృందమ్మ



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, డిసెంబర్16 :** ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకుమెరు గైన వైద్య సేవలు అందుతున్నాయని, వాటిని సద్వి ని యోగం చేసుకోవాలని మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ కోరారు. మంగళవారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి లోని వైద్య సేవలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్, మెడిసిన్ స్టోర్, వ్యాక్సిన్ నిల్వ గది, లేబర్‌రూం, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు,రోజూ వచ్చే రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న చికిత్సలపై డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల అవసరమైన మందులు నిరంతరం అందుబాటులో ఉండాలని, ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రజ లకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి,పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామి నాయుడు, చిన్నారెడ్డి, నాద మునిరెడ్డి, బాబు, నవాబు, మేరీ, హామీద, చైతన్య, నెల్లూరు సుబ్రహ్మణ్యం, సుధాముని, జయ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్య వృక్షాల పెంపకంపై టీటీడీ దూరదృష్టి

**తిరుమల :** దేశంలోనే తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశం చేసే దివ్య వృక్షాల ప్రాజెక్టుకు టీటీడీ శ్రీకారం చుట్టింది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం ప్రాచీన, ఆగమ శాస్త్రాలకు అనుగుణమైన హిందూ దేవాలయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను టీటీడీ స్వయంగా పెంచి, పరిరక్షించి వినియోగించడమేనన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో రూపొందించిన తిరుమల అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉంటుందన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే బాధ్యతాయుత పాలనకు ఇది నిదర్శనమని బీ.ఆర్ నాయుడు అన్నారు. ధ్వజస్తంభం కేవలం నిర్మాణాత్మక అంశం మాత్రమే కాదు. అది భౌతిక లోకానికి, దైవ లోకానికి మధ్య ఉన్న శాశ్వత బంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆలయ ప్రాంగణంలో నిటారుగా నిలిచి ఉండే ధ్వజస్తంభం భక్తి, పవిత్రత, దైవ సన్నిధిని ప్రతిబింబిస్తుంది. ఆగమశాస్త్రాల ప్రకారం ధ్వజస్తంభం నిటారుగా పెరిగిన ఒకే చెట్టుకు చెందిన పవిత్ర వృక్ష కాండంతో తయారు చేయాలి. ఆ వృక్షాన్ని ఆధ్యాత్మిక, జ్యోతిష్య, విధి విధానాలకు అనుగుణంగా ఎంపిక చేసి, ఏళ్ల తరబడి సంరక్షించి, ఆపై శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం వినియోగిస్తారు.



ఆగమ సంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభాల తయారీలో సాధారణంగా టేకు, ఏగిశా (ఇండియన్ కినో), టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. ఇవి బలంగా, దీర్ఘకాలికంగా నిటారుగా పెరిగే స్వభావం కలిగి ఉండటం వల్ల ధ్వజస్తంభం అవసరాలకు అనుకూలంగా ఉంటాయి. పరిపక్వత చెందిన తర్వాత ఆ వృక్షాన్ని శాస్త్రోక్తంగా పూజించి, ఆపై ధ్వజస్తంభంగా రూపకల్పన చేస్తారు. అనంతరం దానిని కవచంతో కప్పి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లాంటి అత్యంత పవిత్ర ఆలయాల్లో స్వర్ణ కవచంతో అలంకరిస్తారు. ఇక రాజగోపురం, గర్భగుడి విమానం మధ్య పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠించే ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఆవిష్కరిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని ప్రకటించే ఈ ధ్వజారోహణం సమస్త లోకాల్లోని దేవతలను ఆహ్వానించే శుభ సూచకంగా నిలుస్తుంది.ఇక దేశవ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను టీటీడీ నిర్వహిస్తోంది. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాలను ఆగమ నియమాలకు అనుగుణంగా నిర్మించే బాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ దివ్య వృక్షాల ప్రాజెక్టును అత్యంత దూరదృష్టితో ప్రారంభిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా కాలక్రమేణ మార్పు అవసరమైన ధ్వజస్తంభాల స్థానంలో శాస్త్రోక్తంగా కొత్త ధ్వజస్తంభాలను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో టీటీడీ నిర్మించనున్న ఆలయాలకు అవసరమైన ధ్వజస్తంభాల కోసం పవిత్రమైన కలపను ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగంగా సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో దివ్య వృక్షాల ప్రాజెక్టు కోసం కేటాయించాలని టీటీడీ బోర్డు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు అమలుతో, ధ్వజస్తంభాల కోసం అవసరమైన దివ్య వృక్షాలను స్వయంగా పెంచే తొలి దేవాలయ సంస్థగా టీటీడీ దేశంలో చరిత్ర సృష్టించనుంది. దీని ద్వారా ఆగమ శుద్ధి, ఆధ్యాత్మిక పవిత్రత, పర్యావరణ బాధ్యత, సంస్థాగత స్వావలంబనను తరతరాలకు కొనసాగించగలుగుతామని టీటీడీ స్పష్టం చేసింది.

### ఇక థర్డ్ పార్టీ తనిఖీలు

కల్తీ నెయ్యి, నకిలీ పట్టు దుపట్టాలకు సంబంధించిన కేసుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సేకరణ, నాణ్యత తనిఖీ వ్యవస్థలను బలోపేతం చేయాలని టీటీడీ భావిస్తోంది. నెయ్యి కల్తీ కేసుపై ప్రస్తుత దర్యాప్తులో సరఫరా గొలుసులో తీవ్రమైన లోపాలు వెల్లడయ్యాయని, నాణ్యత, జవాబుదారీతనం నిర్ధారించడానికి స్పష్టమైన, ఏకరీతి సేకరణ వ్యవస్థ అవసరాన్ని టీటీడీ ఆలోచన చేస్తోందిసేకరణలో లొసుగులను నిలిపివేయడానికి సమగ్ర సేకరణ మాన్యువల్ అవసరమని ట్రస్ట్ బోర్డు భావించిందని ఓ అధికారి తెలిపారు. థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ విషయంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా నిర్వచించిన విధానాలు, సరఫరా గొలుసులను బలోపేతం చేయాలని టీటీడీ భావించింది. కల్తీని, నాణ్యత లేని సామాగ్రిని అడ్డుకోవడం, ఆలయ సంబంధిత సేవలకు ఉపయోగించే పదార్థాలపై విశ్వాసాన్ని పునరుద్ధరించడం దీని లక్ష్యమని అధికారి తెలిపారు.కొత్త మాన్యువల్ ట్రస్ట్.. టీటీడీ చేసే అన్ని కొనుగోళ్లకు మార్గదర్శకంగా పనిచేస్తుంది. ఇది ఉత్పత్తి వివరణలు, నమూనా సేకరణ, నిర్వహణ, నాణ్యత తనిఖీలు, సరఫరా ఒప్పందాలు, డెలివరీ షెడ్యూల్‌లు, సరఫరాదారులకు సాంకేతిక, ఆర్థిక అర్హత ప్రమాణాలకు సంబంధించిన విధానాలను చెబుతుంది.టీటీడీ తీసుకురాబోయే కొత్త వ్యవస్థకు అంతర్గత ప్రయోగశాల పరీక్ష కోసం స్పష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలతో పాటు, తప్పనిసరి థర్డ్ పార్టీ ధృవీకరణ అవసరం. అన్ని సేకరణలు ఈఆాంఎ, ఇతర వర్తించే నియమాలను కచ్చితంగా పాటించాలి.ఆలయ పూజలు, అన్నదానం, వసతి, ఇతర కార్యకలాపాల కోసం దాదాపు 300 రకాల సామాగ్రిని సేకరించడానికి టీటీడీ ప్రతి సంవత్సరం సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేస్తుంది. నెయ్యి ఒక్కటే వార్షిక వ్యయం దాదాపు రూ.70 కోట్లు. గిడ్డంగి సామర్థ్యం సరిపోకపోవడం, ఆధునిక నిల్వ పద్ధతులు లేకపోవడంపై టీటీడీ బోర్డు ఆలోచన చేస్తోంది. ఎందుకంటే ఇది జాబితా నిర్వహణ, మెటీరియల్ నాణ్యత రెండింటికీ ప్రమాదాలను కలిగిస్తుంది.సంస్కరణల్లో భాగంగా క్లైమెట్ కంట్రోల్ స్టోరేజ్, శాస్త్రీయ జాబితా నిర్వహణ వ్యవస్థలు, ఉష్ణోగ్రత, తేమ, పరిశుభ్రత ఆటోమేటెడ్ పర్యవేక్షణ, డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, అగ్ని మరియు ఆహార-భద్రత-అనుకూల మౌలిక సదుపాయాలతో కూడిన అదనపు గిడ్డంగి సౌకర్యాలను తీసుకురావాలని టీటీడీ భావిస్తోంది.

# జగన్‌కు రోజా షాక్

**తిరుపతి :** వైసీపీ పార్టీలో ఫైర్ బ్రాండ్లలో మాజీ మంత్రి రోజా ఒకరు. జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయత ప్రదర్శించిన నేతల్లో కూడా ఆమె ముందుంటారు. అయితే ఇటీవల ఆమె పెద్దగా కనిపించడం లేదు. సహజంగానే సినీ పరిశ్రమకు చెందిన ఆమె బిజీగా ఉంటారు. అందుకే కనిపించడం లేదని అంత భావించారు. అయితే ఆమె హై కమాండ్ పై మనస్థాపంతోనే పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు ప్రచారం మొదలైంది. అయితే రోజాపై ఇటువంటి ప్రచారం కొత్త కాదు. మొన్నటి ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఇదే తరహా ప్రచారం నడిచింది. ఆమె తమిళ చిత్ర పరిశ్రమ వైపు మళ్లీ వెళ్ళినట్లు.. అక్కడే స్థిరపడతారని టాక్ నడిచింది. రాజకీయాలు విడిచి పెడతారని కూడా విశ్లేషణలు వచ్చాయి. కానీ ఆమె తిరిగి తాడేపల్లి ప్యాలెస్ లో హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేశారు. కానీ ఇప్పుడు ఉన్నఫలంగా కనిపించడం లేదు. ఇటీవల జరిగిన పరిణామాలతోనే ఆమె కనిపించడం లేదని తెలుస్తోంది.చిత్తూరు జిల్లా నగిరి నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు రోజా. రెండుసార్లు కూడా అతి కష్టం మీద గెలిచారు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభంజనం ఇచ్చింది. ఆ సమయంలో సైతం నగిరి నుంచి తక్కువ మెజారిటీతో గెలిచారు రోజా.



అయితే ఇందుకు సొంత పార్టీ నేతల వెన్నుపోటు కారణమని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణం స్వీకారం చేయకముందే దీనిపైనే రోజా ఫిర్యాదు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన కొత్త కాబట్టి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక పట్టించుకోలేదు. అయితే 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత రోజాకు మంత్రి పదవి ఇవ్వలేదు. అందుకు సొంత పార్టీ నేతలే అడ్డుకున్నారని ఆమె కన్నీటి పర్యంతం అయ్యారు. విస్తరణలో మంత్రి పదవి వచ్చాక అందరి లెక్క తేల్చుతానని హెచ్చరించారు. అయితే ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా, ఆపై మంత్రిగా వ్యవహరించిన రోజా సొంత పార్టీ వారిని లెక్క చేయలేదన్న విమర్శ ఉంది.మొన్నటి ఎన్నికల్లో రోజాకుటిక్కెట్టు ఇవ్వొద్దని సొంత పార్టీ నేతలే కోరారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆమెపై ఎంతో నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చారు. అయితే ఆమె ఘోరంగా ఓడిపోయారు. ఎన్నికల పోలింగ్ జరిగిన నాడే సొంత పార్టీ నేతలపై విమర్శలు చేశారు. తమ పార్టీ నేతలే ప్రత్యర్థి తో చేతులు కలిపారని ఆరోపించారు. అయినా సరే తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కానీ భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పుడు కూడా అధినేత జగన్మోహన్ రెడ్డికి సొంత పార్టీ నేతలపై ఫిర్యాదు చేశారు. ఆయన పట్టించుకోలేదు. అయితే ఇటీవల నగిరి నియోజకవర్గంలో రెండు మండలాలు టిడిపి ఖాతాలో పడ్డాయి. వైసీపీ ఎంపీపీలపై అవిశ్వాసం పెట్టి టీడీపీ కైవసం చేసుకుంది. దీనిపై కూడా హై కమాండ్ కు ఫిర్యాదు చేశారు రోజా. సొంత పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ జగన్ పట్టించుకోకపోయేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఇక రాజకీయాలు చేయడం వేస్ట్ అని.. వైసీపీలో కొనసాగడం కష్టమేనని తన అనుచరుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. మరి రోజా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి

# తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన

**విజయవాడ :** రాష్ట్ర రాజకీయాల్లో మంత్రివర్గ ప్రక్షాళన అంశం మళ్లీ చర్చకు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలన దిశగా అడుగులు వేస్తుండటంతో, ఈ సమయంలో మంత్రివర్గంలో మార్పులు ఉంటాయా లేదా అనే ఆసక్తి పార్టీ వర్గాల్లో పెరిగింది. చాలా మంది నేతలు ఈ అవకాశంపై ఆశలు పెట్టుకున్నారు. దాదాపు పది నుంచి పదిహేను మంది వరకు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో అనుభవజ్ఞులైన సీనియర్లతో పాటు తొలిసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్న జూనియర్లు కూడా ఉన్నారు.కొద్ది నెలల క్రితమే మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయన్న ప్రచారం జోరుగా సాగింది. కొందరు మంత్రుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారన్న వార్తలు రావడంతో, వారిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇస్తారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఏర్పడింది. అయితే ఆ తర్వాత ఈ అంశం అనూహ్యంగా తెరమరుగైంది. అప్పటి నుంచి మంత్రివర్గ ప్రక్షాళనపై స్పష్టత రాకపోవడంతో నేతల్లో అయోమయం నెలకొంది.ఇప్పుడు మళ్లీ ఈ విషయం టిడిపి లో చర్చకు వస్తోంది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం నుంచి దక్షిణాంధ్రలోని చిత్తూరు వరకు పలువురు కీలక నాయకులు మంత్రి పదవి కోసం ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు కొంతమంది ఎమ్మెల్సీలు కూడా ఈ రేసులో ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడ్డామని, తమకు అవకాశం ఇవ్వాలనే భావనతో వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.అయితే, ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి ఇప్పటివరకు పూర్తిగా దృష్టి పెట్టలేదన్న అభిప్రాయం ఉంది. అసలు ఈసారి మంత్రివర్గ ప్రక్షాళన ఉండకపోవచ్చన్న మాట కూడా పార్టీలో వినిపిస్తోంది. గతంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో ఒకసారి మాత్రమే చిన్నపాటి మార్పులు చేశారు. అప్పట్లో ఒకరిద్దరు మంత్రులను మార్చి మిగిలిన వారిని కొనసాగించారు. ఆ విధానమే ఇప్పుడు కూడా అనుసరించే అవకాశం ఉందని కొందరు నేతలు అంటున్నారు.వైసీపీ పాలనలో మొత్తం మంత్రివర్గాన్ని మార్చిన విధానం అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఒకరిద్దరిని తప్ప మిగిలిన వారందరినీ తొలగించి కొత్తవారిని తీసుకోవడం వల్ల శాఖల పనితీరుపై ప్రభావం పడిందన్న విమర్శలు వచ్చాయి. అదే పరిస్థితి మళ్లీ రాకూడదన్న ఆలోచనతో చంద్రబాబు



వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాల అంచనా. ప్రస్తుతం ఒక మంత్రి పదవి ఖాళీగా ఉండగా, అవసరమైతే మరో రెండు లేదా మూడు స్థానాల్లో మాత్రమే మార్పులు చేసే అవకాశముందని చెబుతున్నారు. చివరికి ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి, కానీ ఆశావహుల ఎదురుచూపులు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

## వాజ్ పేయి మార్గంలోనే ప్రధాని మోదీ పాలన

-మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ హౌసింగ్ బోర్డ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ.. వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొని, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. "చాలామంది నన్ను స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబులలో ఎవరిని ఆదర్శంగా తీసుకుంటారని అడుగుతారు. కానీ ఒక మత్స్యకార గ్రామాన్ని అభివృద్ధి చేసిన సింగపూర్ ప్రధాని లీ క్వాన్ యూ, భారతదేశాన్ని సమైక్యంగా ముందుకు నడిపిన అటల్ బిహారీ వాజ్ పేయిలే నాకు స్ఫూర్తి" అని లోకేశ్ స్పష్టం చేశారు. సమాజంలో నైతిక విలువలు అంటే ఏంటో ఆచరణలో చూపిన గొప్ప వ్యక్తి వాజ్ పేయి అని, ఆయనకు రాజకీయంగా ప్రతిపక్షమే లేదని అన్నారు. చిన్న వయసులోనే కవిత్వానికి, దేశానికి తన జీవితాన్ని అంకితం చేసి, 18 ఏళ్లకే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు. వాజ్ పేయి మూడుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని, తొలిసారి 13 రోజులకే మెజారిటీ లేకపోవడంతో నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేశారని, ఆ తర్వాత ఆయనకు తిరుగులేకుండా పోయిందని లోకేశ్ వివరించారు. దేశ భద్రత కోసం పోఖ్రాన్‌లో అణుపరీక్షలు నిర్వహించి, కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ దురాక్రమణను సమర్థంగా తిప్పికొట్టిన ధీశాలి అని ప్రశంసించారు. ఓ వైపు దేశ భద్రత, మరోవైపు అభివృద్ధికి ఆయన పెద్దపీట వేశారని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి ద్వారా దేశంలో రహదారుల వ్యవస్థకు కొత్త రూపునిచ్చారని, చంద్రబాబు కోరిక మేరకు టెలికాం రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని, ఈనాడు మనం చూస్తున్న ఆధునిక విమానాశ్రయాలకు కూడా ఆయన సంస్కరణలే కారణమని అన్నారు. వాజ్ పేయికి, చంద్రబాబుకు మధ్య తండ్రీకొడుకుల అనుబంధం ఉండేదని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఆనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఢిల్లీకి వెళితే, సొంత కొడుకు వచ్చినంతగా వాజ్ పేయి ఆనందపడేవారు. 1998లోనే ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడింది. ఈ రోజు హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటే దానికి కారణం వాజ్ పేయినే. ఐఎస్‌బీ, బీమా నియంత్రణ సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి, ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌కు నిధులు కేటాయించారు. అందుకే తెలుగు జాతి ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది" అని లోకేశ్ ఉద్ఘాటించారు. వాజ్ పేయి చూపిన మార్గంలోనే ప్రధాని నరేంద్ర మోదీ పయనిస్తున్నారని, అందుకే ఏపీలో ఇప్పుడు డబుల్ ఇంజన్ కాదు, బుల్లెట్ ట్రైన్ వేగంతో ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. ఆర్థికంగా ఎదగడమే కాకుండా, నైతిక విలువలు కూడా ముఖ్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలపై బోధన ప్రారంభిస్తామని తెలిపారు. తన నియోజకవర్గం మంగళగిరిలో వాజ్ పేయి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, బీజేపీ నేత సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు

-మొదటిపేజీ తరువాయి

రిటైర్డ్ ఐఏఎస్ ఆర్తి అహుజా, సైటెస్ ఛైర్ పర్సన్ రిజ్వాన్ కొయిటా, కోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నాదముని, గేట్స్ ఫౌండేషన్ జినోమిక్స్ అండ్ ఎపిడామిలజీ డైరెక్టర్ డాక్టర్ గగన్ దీప్ కాంగ్, పబ్లిక్ హెల్త్ నిపుణురాలు మార్గరెట్ ఎలిజబెత్, ఢిల్లీ ఎయిమ్స్ ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ టాండన్ అత్యుతన్నతస్థాయి నిపుణుల సలహా బందంలో ఉన్నారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బందం సభ్యులు వర్చువల్ గా ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..' 'వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు నిర్దేశించిన అంశాలను అమలు చేస్తున్నాం. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశాం. రియల్ టైమ్ లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుంది. వివిధ అంశాల్లో ప్రజలకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుంది.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తాం"అని సీఎం చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా మేం ప్రయత్నాలు చేస్తున్నాం. ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉంది. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫారమ్స్ లాంటి కీలకమైన అంశాలపై దష్టి పెట్టాలి. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున పెరగాలి. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నాం. వ్యాధుల బారిన పడి ఆ తర్వాత చికిత్స తీసుకోవడం కంటే..ముందుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ విధానాలపై దష్టి పెట్టాలి. ఏడాదిలోగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తాం. స్క్రీనింగ్ లో టాప్ 10లో ఉన్న రోగాలను గుర్తించి విశ్లేషించేందుకు ప్రయత్నిస్తాం. ఇటీవల గిరిజన ప్రాంతాల విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతను నేర్పేలా ఓ చిన్న కార్యక్రమం చేపట్టాం. వివిధ అంశాలకు ఆంధ్రప్రదేశ్ ఓ స్టార్టప్ ఏరియాగా ఉంటుంది. హెల్తీ,వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. నిపుణుల బందం విలువైన సలహాలను ఏపీలో అమలు చేస్తాం."అని ముఖ్యమంత్రి అన్నారు. సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ కేర్ కేంద్రంగా ఏపీ తయారవుతోందని డాక్టర్ రిజ్వాన్ వెల్లడించారు. వైద్య విద్యార్థులు, నర్సుల లాంటి వారికి డిజిటల్ హెల్త్ కేర్ లో శిక్షణ అందించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ, రిస్క్ ఫ్యాక్టర్ ఎంత ఉందన్నది ప్రాథమికంగా గుర్తించాల్సి ఉంటుందని డాక్టర్ నిఖిల్ టాండన్ చెప్పారు. అన్ని వ్యాధులకు ఒకే రకమైన విధానాలను అనుసరించలేమని...ఈ మేరకు క్లినికల్ మేనేజ్మెంట్ అసెస్మెంట్ ద్వారా వేర్వేరు రకాలుగా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేషన్ నుంచే హెల్త్ కేర్ సాధ్యం అవుతుందని డాక్టర్ నాగేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫిట్ నెస్, హైజీన్ లాంటివి విద్యార్థుల దశ నుంచే ఈ తరహా హెల్త్ ఎడ్యుకేషన్ ను అమలు చేయాల్సి ఉంటుందని సూచించారు. రాష్ట్రంలో గ్లోబల్ స్థాయి ప్రమాణాలతో వైద్యారోగ్య నిపుణులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ పనిచేస్తోందని .. ఆ సంస్థ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ అన్నారు. ప్రజారోగ్య పర్యవేక్షణ కోసం ఓ హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందిస్తామని ఆమె స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనల్ని నిపుణుల బందం చేసిందని ..వారి సిఫార్సులు హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఉపకరిస్తాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

## కొత్త కానిస్టేబుళ్లకు అపాయింట్ మెంట్ లెటర్స్



-మొదటిపేజీ తరువాయి

గతంలో 23 వేలకు పైగా పోలీస్ ఉద్యోగాలు, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావించారు. "ఆనాడు వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని చెబితే నేను కూడా నమ్మాను. కానీ ఆయన్ను దారుణంగా హత్య చేశారు. అక్కడికి వెళ్లిన సీఐ ఉన్నతాధికారులకు వాస్తవాలు చెప్పలేదు. ఆ తర్వాత 'నారాసుర రక్తచరిత్ర' అంటూ నాపైనే ప్రచారం చేసి 2019లో గెలిచారు. ఆ రోజు పోలీసులు అప్రమత్తంగా ఉండి ఉంటే నేను ఓడిపోయేవాడిని కాదు" అని కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారి పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత కూడా పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన కానిస్టేబుళ్లకు ఈ నెల 22వ తేదీ నుంచి 9 నెలల పాటు శిక్షణ ప్రారంభం కానుంది.

## బిజినెస్

# మెరుగైన టోకు ధరల సూచీ

టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం మెరుగైంది. నవంబర్‌లో 0.32శాతం పెరిగింది. అంతకు ముందు నెల అక్టోబర్‌లో -1.21శాతానికి తగ్గిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్‌లో ఈ రేటు 2.16శాతంగా నమోదైంది. నెలవారీ ప్రాతిపదికన పప్పులు, కూరగాయల వంటి ఆహార పదార్థాల ధరలు పెరగడంతో టోకు ద్రవ్యోల్బణంలో కొంత మెరుగైంది. నవంబర్ 2025లో ద్రవ్యోల్బణం ప్రతికూల స్థాయిలో ఉండడానికి ప్రధాన కారణం ఆహార పదార్థాలు, ముడి పెట్రోలియం, సహజ వాయువు, ప్రాథమిక లోహాల నిర్మాణం, విద్యుత్ ధరలు తగ్గడమే అని పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. టోకు ధరల సూచీ టోకు స్థాయిలో వస్తువుల ధరల్లో సగటు మార్పును సూచిస్తుంది. నవంబర్‌లో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 4.16 శాతంగా ఉండగా.. అక్టోబర్‌లో ఇది 8.31 శాతంగా ఉంది. నవంబర్‌లో కూరగాయలలో ద్రవ్యోల్బణం 20.23 శాతంగా ఉండగా.. అక్టోబర్‌లో ఇది 34.97 శాతంగా ఉంది. నవంబర్‌లో పప్పుధాన్యాల్లో ద్రవ్యోల్బణం 15.21 శాతంగా ఉండగా.. బంగాళదుంప, ఉల్లిపాయల్లో వరుసగా 36.14 శాతం, 64.70 శాతంగా నమోదైంది. తయారీ ఉత్పత్తుల విషయంలో అక్టోబర్‌లో 1.54 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం నవంబర్‌లో 1.33 శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ ధరలు అక్టోబర్‌లో 2.55 శాతంతో పోలిస్తే, 2.27 శాతం ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైంది. గత వారం విడుదలైన గణాంకాల ప్రకారం.. పెరుగుతున్న ఆహార ధరల కారణంగా నవంబర్‌లో సీపీఐ రికార్డు కనిష్ట స్థాయి 0.25 శాతం నుంచి స్వల్పంగా పెరిగి 0.71 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తక్కువ ద్రవ్యోల్బణం కారణంగా రిజర్వ్ బ్యాంక్



ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పాలసీ వడ్డీ రేట్లను 1.25 శాతం పాయింట్లు తగ్గించింది. ఈ నెల ప్రారంభంలో రిజర్వ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను అంతకుముందు 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది. ఎందుకంటే ఆర్థిక వ్య-క్ ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పర్యవేక్షించడం ద్వారా వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది. ఈ నెల ప్రారంభంలో ఆర్‌బీఐ కీలక పాలసీ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు కోత విధించి 5.25 శాతానికి తగ్గించింది. గత వారం రిజర్వ్ బ్యాంక్ 2026 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచింది. భారత్ సెప్టెంబర్ త్రైమాసికంలో 8.2 శాతం, జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి చెందింది.

### రూ. 4,000 పెరిగిన బంగారం..
### తులం ఇప్పుడు రూ. 1.37 లక్షలు

బంగారం ధరలు మరోసారి కొత్త రికార్డు గరిష్టాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయ మార్కెట్లో భారీ గిరాకీ కారణంగా ధరలు దూసుకెళ్తున్నాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర ఒక్కరోజే రూ. 4,000 పెరిగి రూ. 1,37,600కి చేరుకుంది. హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 1,35,480కి చేరింది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 1,24,100కి పెరిగింది. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ధర 4,350 డాలర్లకు పెరగడంతో, దేశీయ మార్కెట్‌లోనూ ర్యాలీ కొనసాగిందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ప్రధానంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారానికి డిమాండ్ పెరుగుతుండటంతో పాటు అమెరికాకు చెందిన నాన్-ఫార్మ్ పెరోల్స్ సహా ఆ దేశ ఆర్థిక డేటాపై అంచనాల కారణంగా ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ఇప్పుడందరి దృష్టి యూఎస్ ఆర్థిక డేటాపై ఉండటమే ధరల పెరుగుదలను ప్రభావితం చేస్తున్నాయని జతీన్ త్రివేది వివరించారు. ప్రస్తుత క్యాలెండర్ ఏడాదిలో బంగారం ధరలు ఏకంగా 74.3 శాతం పెరిగాయి. 2024, డిసెంబర్ 31న 10 గ్రాముల పసిడి రూ. 78,950 ఉంది. అంటే ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం రూ. 58,650 పెరిగింది. మరోవైపు, వెండి ధరలు రూ. 5,000 పెరిగి రూ. 2,15,000 (అన్ని పన్నులతో కలిపి)కి చేరుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి కూడా భారీగా పెరిగింది. 2024, డిసెంబర్ 31న కిలో రూ. 89,700 ఉండగా, 122.41 శాతం పెరిగి రూ. 2.15 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్ 1.16 శాతం పెరిగి 4,350.06 డాలర్లకు చేరింది. గత ఐదు సెషన్లలో ఔన్స్ బంగారం 3.80 శాతం పెరిగింది. ఔన్స్ వెండి 3.24 శాతం పెరిగి 63.96 డాలర్లకు చేరుకుంది.

### మరో పావలా పతనమైన రూపాయి



భారత కరెన్సీ రూపాయి మారకం విలువ రోజురోజుకు మరింత పతనమవుతోంది. గతవారం వరుసగా రికార్డు పతనాన్ని చూసిన తర్వాత సోమవారం రూపాయి విలువ ఇప్పటివరకు ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయి రూ. 90.80కి క్షీణించింది. ఆ తర్వాత కొంత కోలుకున్నప్పటికీ, అమెరికా డాలరుతో రూపాయి విలువ రూ. 90.74 వద్ద స్థిరపడింది. గతవారం ముగింపుతో పోలిస్తే ఇది 25 పైసల నష్టాన్ని నమోదు చేసింది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతుండటం, భారత ఈక్విటీల నుంచి విదేశీ నిధులు తరలిపోతుండటం ఇందుకు ప్రధాన కారణాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా దిగుమతిదారుల నుంచి అమెరికా డాలర్‌కు భారీ డిమాండ్ ఉండటం, ప్రస్తుతం ఉన్న రిస్క్‌తో కూడిన మార్కెట్ ధోరణి పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసిందని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. భారత రూపాయి రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది, ఇది ఆసియా కరెన్సీలలో అత్యంత బలహీన కరెన్సీగా నిలిచింది. ఊహించిన దానికంటే మెరుగైన వాణిజ్య గణాంకాలు నమోదైనప్పటికీ, రూపాయికి మద్దతు లభించలేదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పరిశోధన విశ్లేషకుడు దిలీప్ పర్మార్ అన్నారు. ఇందుకు ప్రధానంగా డిమాండ్-సరఫరా అసమతుల్యతకు కారణమని, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్, విదేశీ నిధులు తరలిపోవడం కారణంగా రూపాయిపై ప్రతికూల ప్రభావం కొనసాగుతోందని దిలీప్ పర్మార్ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ. 90.95 వద్ద, బలహీనపడితే రూ. 90.50 వద్ద స్థిరపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారత్-అమెరికా ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు, అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలరు ఇండెక్స్ రూ. 98.23 వద్ద ట్రేడవుతోంది.

# పదేళ్ల గరిష్ట స్థాయికి చేరిన భారత ఎగుమతులు


భారత వాణిజ్య లోటు గణనీయంగా దిగొచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఏడాది నవంబర్‌లో దేశ వాణిజ్య లోటు 24.53 బిలియన్ డాలర్లు(రూ. 2.22 లక్షల కోట్లు)గా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో ఇది 31.93 బిలియన్ డాలర్లు(రూ. 2.89 లక్షల కోట్లు)గా ఉంది. మరోవైపు, నవంబర్ నెలలో దేశ దిగుమతులు 1.88 శాతం తగ్గి 62.66 బిలియన్ డాలర్లు(రూ. 5.68 లక్షల కోట్ల)కు చేరాయి. ఎగుమతులు మాత్రమే ఏకంగా 23.15 శాతం పుంజుకుని 38.13 బిలియన్ డాలర్ల(రూ. 3.46 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. ఇది గడిచిన 10 ఏళ్లలోనే అత్యధికం కావడం విశేషం. ఎగుమతులు ఈ స్థాయిలో వృద్ధి సాధించేందుకు ఇంజనీరింగ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, రత్నాభరణాలు, డ్రగ్స్, ఫార్మా వంటి రంగాలు ప్రధాన చోదకాలుగా ఉన్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. సమీక్షించిన నెలలో బంగారం దిగుమతులు 60 శాతం తగ్గాయి. బంగారం కాకుండా, పెట్రోలియం ఉత్పత్తులు, వంట నూనె, బొగ్గు దిగుమతులలో కూడా గణనీయమైన క్షీణత కనిపించిందని ప్రభుత్వ డేటా స్పష్టం చేస్తోంది. ఇక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో ఎగుమతులు 2.62 శాతం పెరిగి 292.07 బిలియన్ డాలర్ల(రూ. 26.50 లక్షల కోట్ల)కు చేరుకోగా, ఈ ఎనిమిది నెలల కాలంలో దిగుమతులు 5.59 శాతం పెరిగి 515.21 బిలియన్ డాలర్ల(రూ. 46.75 లక్షల కోట్ల)కు చేరాయి. డేటా ప్రకారం, నవంబర్‌లో అమెరికాకు గతేడాది కంటే 22 శాతం ఎక్కువగా 6.97 బిలియన్ డాలర్ల(రూ. 63.24 వేల కోట్ల) విలువైన ఎగుమతులు జరిగాయి. టారిఫ్‌లు విధించినప్పటికీ, మేము అమెరికాకు ఎగుమతులను కొనసాగించగలిగామని రాజేష్ అగర్వాల్ అన్నారు. అయితే, ఇరు దేశాలు స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ ప్రస్తుతం అమెరికాతో చర్చలు కొనసాగిస్తోంది.



## స్పోర్ట్స్

# కేకేఆర్ జట్టులోకి శ్రీలంక ఫాస్ట్ బౌలర్..
# రూ.18కోట్లు పలికిన మతీషా పతిరానా!

ఐపీఎల్ 2026 వేలం అబుదాబి వేదికగా రసవత్తరంగా సాగుతున్నది. 77 స్లాట్స్ కోసం భారత, విదేశీ క్రికెటర్లు పోటీపడుతున్నారు. ఇప్పటి వరకు సాగిన వేలంలో అత్యధికంగా ఆస్ట్రేలియా క్రికెటర్ కామెరాన్ గ్రీన్ అత్యధికంగా రూ.25.20 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ కొనుగోలు చేసింది. దాంతో ఐపీఎల్‌లో అత్యధిక ధరకు అమ్ముడయిన విదేశీ ఆటగాడిగా గ్రీన్ నిలిచాడు. శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీషా పతిరానా కోసం పలు జట్లు పోటీపడ్డాయి. రూ.2కోట్ల బేస్ ప్రైజ్‌తో వేలంలోకి వచ్చిన ఈ ఫాస్ట్ బౌలర్ కోసం ఢిల్లీ, లక్నో జట్లు పోటీపడ్డాయి. ఇరు జట్లు రూ.13కోట్ల వరకు వెళ్లాయి. మధ్యలో కేకేఆర్ సైతం ఎంట్రీ ఇచ్చింది. అదే సమయంలో సీఎస్‌కే సైతం ఆసక్తిని మళ్లీ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపింది. రూ15కోట్లకు బిడ్ వేసింది. కేకేఆర్ రూ.16కోట్లకు కొనుగోలు బిడ్ వేసింది. అయితే, లక్నో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కోల్‌కతా రూ.18కోట్లకు వేలంలో దక్కించుకొని తమ జట్టులో చేర్చుకుంది. ఐపీఎల్ వేలంలో ఇప్పటికే కామెరూన్ గ్రీన్‌ను రికార్డు ధరకు దక్కించుకున్న కేకేఆర్ తాజాగా.. శ్రీలంక ఫాస్ట్‌బౌలర్‌ను సైతం రూ.18కోట్లకు కొనుగోలు చేసి అందరినీ షాక్‌కు గురి చేసింది. మిచెల్ స్టార్క్ స్థానాన్ని భర్తీ చేసేందుకు కేకేఆర్ డెత్ బౌలర్‌ను జట్టులోకి తీసుకోవాలని భావించింది. దాంతో పతిరానా కోసం తీవ్రంగా పోటీ పడింది. డెత్ ఓవర్లలో పతిరానా దిట్ట. యార్కర్లు వేయడంలో స్పెషలిస్ట్. అందుకే ఈ లంక బౌలర్‌ను బేబీ మలింగగా పిలుస్తుంటారు. పతిరానా గతంలో చెన్నై తరఫున నిలడగా రాణించాడు. మతీషా పతిరానా ఐపీఎల్‌లో 32 మ్యాచుల్లో 1016 పరుగులు చేయడంతో పాటు 47 వికెట్లు పడగొట్టాడు.







### కుర్రాళ్లకు జాక్‌పాట్.. రూ.14.20 కోట్లు పలికిన చిచ్చరపిడుగులు..!

ఐపీఎల్ మినీ వేలంలో కుర్రాళ్లు సైతం భారీ ధర పలుకుతున్నారు. దేశవాళీ క్రికెట్‌లో దంచేస్తున్న.. వికెట్ల వేటతో రెచ్చిపోతున్న ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోటీశ్వరులను చేస్తున్నాయి. జమ్ముకశ్మీర్ పేసర్ అకీబ్ దార్ రూ.8.40 కోట్లు పలకగా.. ఉత్తరప్రదేశ్ కుర్రాడు ప్రశాంత్ వీర్ ఏకంగా రూ.14.20 కోట్లు కొల్లగొట్టాడు. మరో యంగ్‌స్టర్ కార్తిక్ శర్మ ను సైతం రూ.14.20 కోట్లకు దక్కించుకుంది చెన్నై సూపర్ కింగ్స్. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న కుర్రాళలు ఐపీఎల్ వేలంలో కోట్లు పలుకుతున్నారు. విధ్వంసక ఆటగాడైన ప్రశాంత్ వీర్ రూ.30 లక్షలతో వేలంలోకి రాగా.. అతడిని రూ.14.20 కోట్లకు పట్టేసింది చెన్నై సూపర్ కింగ్స్. అలానే వికెట్ కీపర్, బ్యాటర్ అయిన కార్తిక్ శర్మ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోటీపడిన సీఎస్కే చివరకు రూ.14.20 కోట్లకు దక్కించుకుంది. నిఖార్సైన రవీంద్ర జడేజా స్థానాన్ని వీరిలో భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే ప్రశాంత్, కార్తిక్‌లై చెన్నై ఫ్రాంచైజీ కోట్లు కుమ్మరించింది. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటరైన ప్రశాంత్ ఇటీవల యూపీ టీ20లో 155.34 స్ట్రయిక్ రేటుతో 320 పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించి 8 వికెట్లు కూల్చాడీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 112 రన్స్.. బంతితోనూ తిప్పేస్తూ 9 వికెట్లు పడగొట్టాడు. 19 ఏళ్ల కార్తిక్ ఇప్పటివరకూ టీ20ల్లో 12 మ్యాచుల్లో 162.93 స్ట్రయిక్ రేటుతో 334 పరుగులు సాధించాడు.



### ఒకప్పుడు మ్యాచ్ విన్నర్లు.. ఇప్పుడేమో కనీస ధర పలకలే..!



ఐపీఎల్ మినీ వేలంలో యువక్రికెటర్లు కోట్లు కొల్లగొడుతుంటే.. గత సీజన్లలో దంచేసిన ఆటగాళ్లకు మాత్రం చుక్కెదురైంది. కనీస ధరకు కూడా వీళ్లను కొనేందుకు ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపించలేదు. ఫలితంగా పృథ్వీ షా విజయ్ శంకర్, రచిన్ రవీంద్ర బెయిర్‌స్టో, రహ్మనుల్లా గుర్బాజ్ వంటి స్టార్లు నిరాశకు లోనయ్యారు. వీరిలో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ప్లేయర్లకు కూడా వేలంలో బిగ్ షాక్ తగిలింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంపై భారీ ఆశలు పెట్టుకున్న క్రికెటర్లకు ఊహించని షాకిచ్చాయి ఫ్రాంచైజీలు. గతంలో మ్యాచ్ విజేతలుగా పేరొందిన రచిన్ రవీంద్ర, బెయిర్‌స్టో, డెవాన్ కాన్వే, లివింగ్‌స్టోన్ వంటి హిట్టర్లను కనీస ధరకు కూడా ఎవరూ కొనలేదు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అర్ధ శతకాలతో రెచ్చిపోయిన పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్‌లను సైతం ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్‌ను సైతం వదిలేశారు. ఇక భారత అన్‌క్యాప్డ్ ప్లేయర్లలో శివం మావి, మహిపాల్ లొమ్‌రోర్, అన్మోల్‌ప్రీత్ సింగ్.. తదితరులు వేలంలో అమ్ముడుపోలేదు. అలానే విశ్వవేదికపై చెలరేగిన బౌలర్లు అట్కిన్సన్, మ్యాట్ హెన్రీలను ఎవరూ కొనలేదు. ప్రస్తుతానికి అమ్ముడుపోని ఆటగాళ్ల జాబితా ఇది. భారత క్రికెటర్లు : విజయ్ శంకర్, రాహుల్ చాహర్, ఆకాశ్ దీప్, పృథ్వీ షా, సిమర్జిత్ సింగ్, రాజ్ లింబానీ, తుషార్ రహేఉజా, రుచిత్ అహిర్, సన్వీర్ సింగ్, కమలేష్ నగర్‌కొటి, తనుష్ కొతియాన్, మహిపాల్ లోమ్‌రోర్, రాజ్‌వర్ధన్ హంగ్రేకర్, ఈడెన్ టామ్, ఆర్య దేశాయ్, యశ్ ధుల్, అభినవ్ మనోహర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, అభినవ్ తెజ్రన, అథైర్వ తైడే, శివం మావి, కేఎస్ భరత్, దీపక్ హుడా, సర్ఫరాజ్ ఖాన్, కుమార్ కార్తికేయ సింగ్, విఘ్నేష్ పుతూర్, ప్రశాంత్ సోలంకి, కరన్ శర్మ.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143